# వలస

శ్రీ యాముజాల శంకరం

రైలు నడకవల్ల చిన్న కుదుపుతో జోకొట్టినట్టుగా ఉంది. అతిప్రయాసతో యీ పైబర్తు సాధించి పక్క పరచి వత్తిగిల్లాడు సూర్యం.

నలువైపులా చీకటి ముసురుకుంది. లోపల లైట్లు వెలుగుతున్నాయి. పెట్టంతా రణగొణ ధ్వని; చిరు చలి వేస్తోంది. దుప్పటితీసి ముసుగు తన్నాడు. మగతగా ఉంది. కండ్లు మూతలు పడ్డాయి. గతించి పోయిన అనుభూతులు రైలు చక్రాల్లా మనోనేత్రం ముందు దొర్లుతున్నాయి.

* * * *

భార్య అన్నపూర్ణమ్మకు పదెకరాల పొలం, పెద్దలోగిలి, ఐదేళ్ళ పసివాణ్ణి తన్ను, వదలి తన తండ్రి పరంధామయ్య పరంపదించాడు. తల్లి తన్ను తీసుకొని తన మేనమామ వెంకట్రావింటికి వచ్చింది. అప్పటి నుంచి అక్కడే మకాము.

మామయ్యకు ముగ్గురు పిల్లలు. పెద్దది నిర్మల. తనకంటే ఏడాదే చిన్న. రెండోవాడు రవణ. కడగొట్టుది కమల. కమల పుట్టింతరువాత మీనాక్షమ్మకు పెద్దజబ్బు చేసింది. ఆపరేషన్ చేశారు. ఆ తరువాత పిల్లలు పుట్టకుండా పోయారు.

ఇంట్లో అందరికి తనకు కమలకు వివాహం చేయాలని ఉంది. ఇది సాకుగా తీసుకొని రవణ కమలను ఏడిపించేవాడు. "ఇటు చూడమ్మా! చెల్లమ్మా! ఈ కలం మీ ఆయనది. అదే —నీ మొగుడిది. జాగ్రత్త పెట్టు..."

చిన్నతనం. ఉడుకుమోత్తనం పట్టలేక తల్లితో తన కష్టం వెళ్ళబోసుకునేది. తల్లి అంతా విని, నవ్వుతూ, పిల్లను వళ్ళోకి తీసుకొని, గారాబంగా:— "మీ అత్తయ్యకు కూతురుంటే రవణ ముక్కుకు గాలం వేసేవాళ్లం. మరి కొడుకాయె. నిర్మలకు, సూర్యానికి యీడు కాదాయె ఏదో ముడి పెడదామంటే అయిన సంబంధం పోగొట్టుకుంటామా! ఎట్లాగయినా మీ యిద్దరికి తప్పదుగా మరి!..."

"నువు కూడా అలా అంటావేం?..." వీదబడి గిల్లేది; కొట్టేది.

"జుట్టు పీకేశేయ్! ఇట్లా కూర్చో. చూడు కమలా! వాడనుకుంటే నీ కెందుకే?..."

"ఎందుకనాలేం?"

"మరి ఎప్పుడోకప్పుడు ఎవరికో ఒకరికి నిన్ను కట్టాలిగా!..."

"నే నేమన్నా బర్రెనా - కట్టటానికి"

"నీకు తెలియదుగాని, పెండ్లి అంటే అంతేనమ్మా!..." అంటూ పిల్లతో కాసేపు ఆడుకునేది.

చాటుగా ఉండి యిదంతా వినేవాడు తను.

తల్లికి పిల్ల లోకువయింది. "ఇదిగో యీ కాఫీ నీ మొగుడికిచ్చి రావే పిల్లా!..."

"నీ భర్తగా రొస్తున్నాడు. దారిమ్మ..."— అన్న.

అంతా ఏడిపించేవారు. తనకీ పుట్టింది బుద్ధి. నూతి దగ్గర కూర్చుని మహా రుద్దుతోంది మొహం. దగ్గరగా వెళ్ళాడు:—"చూడు! అంతా ఏమంటున్నారో!..."—చిలిపిగా అన్నాడు.

"అంటే యేం?..." కోపంగా అంది.

"అవకుండా అంటె, కోపంగా ఉండదేమిటి?..."

"ముందవుతుందేమిటి? నిన్నసలు చేసుకోను..."

"నువు నన్ను చేసుకోకపోతే, నిన్ను నేను చేసుకుంటాను."

గబగబా ముఖం కడుక్కొని లోపలికి పోబోయింది. పరికిణి తను తొక్కిపట్టి ఉంచాడు. క్రింద

పడింది. కోపం వచ్చింది. ఏడుపూ వచ్చింది:— "నిన్ను చస్తే చేసుకోను..."—అంది.

"నన్నుమించి నీ కెవడొస్తాడు..."

తలుచుకుంటూఉంటె ఒళ్లు పులకరించింది. చిన్నగానవ్వుకుని పక్కకు వత్తిగిల్లాడు.

రైలుకుదుపుతో జోకొడుతూంది.

* * *

కీ(ర్రుమంటూన్న అరణ్యం మధ్యగుండా సాగిపోతోంది రైలు. కీచురాళ్ళధ్వని...నక్కలకూతలు... భయంకరంగాఉంది.

ఛట్టున స్ఫురణకువచ్చింది. ఏం జబ్బో చెప్పలేదు తను. అమ్మ అవసానదశలోఉంది. అమ్మమీదపడి బోరునఏడ్చాడు. మాటలు పెకల్చుకుని మామయ్యతో అంది:—"వీడికి నీవే దిక్కు..."

"అదేమిటి చెల్లి! నామీదనమ్మకంలేదా?..." మామయ్యకూడా కండ్లుతుడుచుకున్నాడు.

తల్లి తనకు బుద్ధులుచెప్పింది. మామయ్యకు ఎదురు చెప్పనని మాటయిచ్చాడు. మామయ్యపిల్లను చేసుకోమంది. కమలను చూపబోయింది. స్మృతితప్పింది. తల నిర్మలకేసి పడిపోయింది. ఎగశ్వాసం పుట్టింది. పిల్లలను బయటకు లాక్కువచ్చింది అత్తయ్య.

అంతా గొల్లుమన్నారు.

బరువుగా శ్వాసవదలాడు. క్షణంశూన్యంలో తడుముకున్నాడు. లేచి, వంగికూర్చుని, సిగరెట్టు ముట్టించాడు.

రైలు కదులుతూంది; కుదుపుతూంది.

* * *

అందరూ అమ్మా—నాన్నా—అనిపిలుస్తారు. తను అత్తయ్యా మామయ్యా అంటాడు. అంతే తేడా. అంతకన్నా భిన్నత్వం తనకేం కనుపించదు.

నిర్మలా, రమణా కూడా ఇంటరుపరీక్షలు(వ్రాసి యింటికొచ్చి ఉంటారు. కమల ఎలా(వ్రాసిందో స్కూలుఫైనల్ పరీక్ష. అంతా తనరాకకోసం ఎదురు చూస్తూంటారు. ఇంకొక్కసంవత్సరం కళ్ళుమూసుకుంటె తనూ యీ ఎం.బి.బి.యస్. పాసవుతాడు. తన ఊళ్లోనే (ప్రాక్టీసుపెట్టాలి. అచుట్టుపట్ల సరయిన డాక్టరులేడు. డబ్బుకూడా బాగావస్తుంది. పేరూ ఉంటుంది.

కమలకు తనుతీసుకొనిపోయే జార్జెట్టుచీరె నచ్చుతుందో లేదో! ఊహాసౌధాల్లో మునిగి తేలుతూ, నిద్రాదేవతవడిలో వాలాడు.

* * *

సందడిగావుంది యిల్లు. పిల్లలంతా సెలవలకు యిండ్లకువచ్చారు. పాతమిత్రుల్ని, క్రొత్తమిత్రుల్ని కలుసుకున్నారు. తమతమ కాలేజీల అనుభవాలగురించి చర్చించుకుంటున్నారు. పొందిన బహుమతుల్ని చూపించుకుంటున్నారు. భవిష్యత్తు చర్చల్లో స్వర్గానికి నిచ్చెనలు వేస్తున్నారు. దినాలు దొర్లుతున్నాయి.

ఇన్నాళ్లకివ్వాళ వెంకట్రావుగారు తనమేనల్లుణ్ణి వెంటబెట్టుకొని పొలాలమీదికి బయలుదేరాడు. కొంత సేపయినతరువాత గోదావరితీరానికి చేరుకున్నారు. నిర్జనప్రదేశం. ఇద్దరూకూలబడ్డారు.

చాలాసేపు వెంకట్రావుగారు వేదాంతాన్ని, కర్మనుచర్చిస్తూ పోయాడు. "జీవితంలో అనుకున్నవన్నీ కావు. ఏమిటో యీప్రపంచం. ఒకదానికి మరొదానికి పొంతుఉండదు. మనమొకటిఅనుకుంటాం. కానిజరిగేది మరొకటి అటు మీవంశం వారు ఇటు మావంశం వారు ఎంతో ఘరానాగా (బతికారు. ఎప్పుడేం జరుగుతుందో ఎవరమేం చెప్పలేం? విచిత్రమైన పరిణామాలవల్ల వంశాలు పతనమైపోతూంటాయి. వ్యక్తులు కూలిపోతారు......." కంఠంలో జీరకొద్దిగా కనుపించింది. సూర్యం కొంచెం కదలాడు.

"చంటిపిల్లవాడుగా ఉన్నప్పుడు నిన్ను మీ అమ్మమాయింటికి తీసుకొని వచ్చింది. అప్పటినుంచి నువుమాచేతుల్లోపెరిగావు. మధ్యలో మీ అమ్మ కూడా మనలను వదలిపోయింది. అస్తమించేటప్పుడు ఏం చెప్పిందో జ్ఞాపకముందా? నిన్ను నాచేతుల్లో పెట్టింది. నీ ఆస్థికి, నీకు...నీభావి జీవితానికి నేను సంరక్షకుణ్ణి కావలసివచ్చింది. నాచెల్లెలి అంతిమకోర్కె నెరవేర్చటంకోసం నేను, నావిధి కడు జాగ్రతగా నిర్వర్తించాను. ఇంకా ఏం చెప్పిందో జ్ఞాపకముందా— సూర్యం!......"

"మామయ్య పిల్లలను చేసుకోమంది. నీమాటకెదురు చెప్పనని మాటకూడా యిచ్చాను. ఈ రెంటికి యిప్పటికి, ఎప్పటికి కూడా నేను వ్యతిరేకంగా నడువను..."

"నీవన్నమాట చెల్లించుకుంటావా?"

"అదేమిటి మామయ్యా! నామీద నీ కెవరైనా అపవాదులు చెప్పారా? అవేం నమ్మకుమామయ్యా! నేను నీవాణ్ణి అంతే నే ననగలుగుతాను"

"సూర్యం? అలాకూర్చో! నీకు తెలుసుగదూ! నాకు చదువులపిచ్చి ఎక్కువని. నాపిల్లల్ని బి. ఏలు; ఎం. ఏలు చదివించి గొప్పవాళ్లను చేద్దామనుకున్నాను. అందుకే చదివిస్తున్నాను... కాని..." ఆగిపోయాడు.

చాలాసేపు గతించిపోయింది. "సెలవలకు నా పిల్లలంతా యింటికి వచ్చారు. నాయిల్లు కళకళలాడు తోంది. కాని మీ అత్తయ్యముఖంలోని దైన్యం గుర్తించావా?" చటున సూర్యానికేదో స్ఫురణకు వచ్చింది. అత్తయ్యేగాదు, మామయ్యకూడా అలానే ఉన్నాడు. నిర్మలకూడా అలానే ఉంది. నిర్మల కొంచెం పెద్దమనిషి తరహాపిల్ల. అదిగాక పెద్దది. ఎక్కువగా ఎప్పుడూ మాట్లాడదు. కమల కూడా యీడొచ్చినపిల్లే అయితేనేం చిలిపిది; నిర్మలలో అగాధాలు అంతుపట్టవు. అతిగాంభీర్యం ఉంది. కమల అలాకాదు. ఆవేశాన్ని, ఆవేదనను అణచుకోలేదు. ఇద్దరూ అందగత్తెలే. నిర్మల కొట్టవచ్చినట్లుగా ఉంటుంది. కమలలో మెత్తదనం ఎక్కువ కమలకంటె నిర్మలే ఓవాసి అందంలో ఎక్కువ అంటారు. కమల లోని చిలిపితనం దీన్ని కప్పేస్తుంది.

నిశ్శబ్దానికి భంగం కలిగిస్తూ వెంకట్రావుగా రన్నారు—ఒకరోజు మేడమీద నేనేదో లెక్కలు వ్రాసుకుంటున్నాను. మీ అత్తయ్య నాదగ్గరకు వచ్చింది. "ఇంత జరుగుతుందనుకో లేదు, కొంప మునిగింది."—అంది.

"ఏం జరిగింది" అన్నాను.

"మీరు వద్దనిచెబితే విన్నారుకాదు. నెత్తిమీది కొచ్చింది..."

"అబ్బ! ఏం జరిగిందో చెప్పరాదూ?" పని పాడవుతోందని విసుక్కున్నాను. ఇటు అటుచూచింది ఎవ్వరూలేరని నిర్ధారణ చేసుకుంది. మెల్లగా నాచెవిలో ఊదింది!—"నిర్మల గర్భిణి"

ఒక్కసారి స్తంభించిపోయాడు సూర్యం.

"ఈవూరికి పెద్దమనిషిని నేను. ఎవరు ఏం చేయబోయినా నాసహాయం కోరుకుంటారు. తర తరాలుగా అభిమాన గౌరవ సంప్రదాయాలతో పెరిగింది నావంశం. ఒక్కసారి అతః పాతాళానికి అణగ ద్రొక్కబడుతుందని ఎలా అనుకుంటాను చెప్పు. రేపు నలుగురిలో తలఎలా ఎత్తుకొని తిరిగేది. ఇన్నాళ్ళ కివ్వాళ యీ కళంకం వచ్చింది. నా పిల్లలు నాజీవి తంతో చెలగాట మాడుతారని ఎలా అనుకుంటాను. చటున కండ్లద్దుకున్నాడు. సూర్యం తబ్బిబ్బయ్యాడు.

"చెప్పు సూర్యం! నా అవస్థలో నువ్వుంటే ఏంచేస్తావు? ఇలాంటి విషయాలు యితర్లతో చర్చించ రాదు. మన మానమర్యాదలను హృదయంలో పదిల పరుచుకునే ఆత్మీయులతో ఆలోచించాలి. అందుకే నిన్నడుగుతున్నాను. చెప్పు?..."

ఏంచెబుతాడు. ఏంచెబితే బాగుంటుంది. నిజంగా మామయ్య స్థితిలో తనుంటే ఏం చేస్తాడు: "నాకు మాత్రం ఏం తెలుసు మామయ్యా! ఏం చేయాలో ఏంచేస్తే బాగుంటుందో? నాకు ఏమీ తోచటంలేదు" అన్నాడు.

"కుమిలిపోతూ మీ అత్తయ్య నాతో చెప్పింది. క్షణం నిశ్చేష్టుడయ్యాను. కోపంతో ఘూర్ణిల్లి పోయాను. నిర్మలను నిలువునావరికి వేద్దామనుకున్నాను. కాని మచ్చమాసిపోతుందా? వ్యథతో నాహృదయం దహించుకొని పోతోంది. ధనం లేకపోయినా బ్రతుక వచ్చు. మానమర్యాదలు పోయింతరువాత జీవచ్ఛవంలా ఎలా సంచరించేది. సైడుకాలవల్లోపడి నానా ఉచ్చ నీచం తినే పందిలా యీ దుర్భర జీవితాన్ని ఎలా కొనసాగించేదిరా! అబ్బా!! అటుచూడు. ఆ పారే ప్రవాహంకేసి చూడు. ఆ ఎత్తైన గట్టుమీద నుంచి ఆ బండ ఎలా విరుచుకుని పడిందో? అలా...సరిగ్గా అలాగే... నేనుకూడా..."

"మామయ్యా!" ఆవేశంలో అరచాడు సూర్యం.

"కొన్నిదినాలుగా అదే ఉద్దేశ్యం నాలో ఉంది. తెగించలేక పోతున్నాను. నేనుకూడా దాటిపోతే కుటుంబం అపవాదులపాలై వీధులపాలవుతుంది. కాని బ్రతికుండగానే యీ కళంకాన్ని కొంగున కట్టుకొని ఎలా తిరిగేది..." ఉత్తరీయంతో కండ్లు అద్దుకున్నాడు.

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది. దూరాన రెండు కొండలమధ్యా, తాటితోపుల మాటున పండు ముసలితనాన్ని నిరూపిస్తూ, అస్తమిస్తూన్న అరుణదేవుడు

రివ్వగాలికి నీటిపై లేచే చిరు కెరటాలను, తన సాంధ్య కిరణాలతో, ముద్దు పెట్టుకుంటున్నాడు.

"సూర్యం!... నాకు సహాయపడవూ?"

"ఏమిటి మామయ్యా?..."

"ఎలా అడిగేదిరా? ఏమని చెప్పేది?..."

"ఫరవా లేదు చెప్పు తప్పకుండా చేస్తాను..."

"నిర్మలను మరోడికిచ్చి పెండ్లిచేద్దా మనుకున్నాను. అపవాదు ఆగదు, నిజందాగదు. కుక్కలు చింపిన విస్తరవుతుంది. చూచావా? ఒక్కరివల్ల ఎందరం ఎన్నిబాధలు పడాల్సివస్తోంది. అయ్యో! ఇది నాకు పుట్టకపోతే ఎంత బాగుండేదిరా!..."

"బాధపడి ప్రయోజనం లేదు మామయ్యా! ఉపాయమేదన్నా ఆలోచించు. బెంబేలుపడి కార్యం సాధించలేము..."

"నామానాన్ని కాపాడు సూర్యం!..."

"తప్పకుండా. ఏం చేయమంటావ్?..."

"నిర్మలను పెండ్లి చేసుకోగలవా?..."

"మామయ్యా!..."

"అవునురా! గత్యంతరం లేక ప్రాధేయపడుతున్నాను..."

"అదెలా సంభవమవుతుంది..."

"నేనూ అంతే అనుకున్నాను. అందరికి నేనన్ని రోజులు ఉన్నాను. ఇవ్వాళ నాకొక్కరులేరు. చిత్రం. ఇంతవరకూ నేనెవరి సహాయం అపేక్షించలేదు. నేటికి నాయింట్లో, నావంట్లో పుట్టిన యీ కులట మూలాన అందరికి తల వంచాల్సివచ్చింది. ఒకరోజు వెంకట్రావంటే అందరికి హడల్. ఈనాడు అందరికి ఆ వెంకట్రావు భయపడాలి. ఒకనాడు యీ గ్రామానికి సింహం. ఈనాడు గ్రామసింహం. ఆ వెంకట్రావు చచ్చిపోయాడని చాటించరా?..." అరిచాడు ఉద్రేకంలో.

"మామయ్యా!"

"నాకు పిచ్చికూడా ఎక్కుతోంది. భగవంతుడిలా ఎందుకు చేస్తున్నాడో చెప్పలేము! బహుశా ఎవరి జీవితాలు అంతం కావలసి ఉన్నాయో!"

"అల్లా అనకు మామయ్యా!...

"ఆరిపోయే దీపంలా, చల్లారిపోయే జీవితాలు, ఇంకా దేన్ని చూచో రెపరెప కొట్టుకుంటాయి. దాన్ని ముందు యీ మడుగులో తొక్కి, తర్వాత నేను చస్తాను." కోపంతో గర్జించాడు.

"నామాట కొంచెం వినుమామయ్యా!..."

"ఏం వినమంటావ్, నామాట నువు విన్నావా? అమ్మదగ్గర ప్రమాణంకూడా చేసావుకదూ!..."

"అది సాకుగా!..."

"అందుకే నిన్ను ఏమీ అనటంలేదు. నామానం కాపాడమని నీకాళ్లు పట్టుకుంటున్నాను..." కాళ్ల మీద పడ్డాడు.

"మామయ్యా!..." ఉద్రేకాన్ని అణచుకుని: "నన్ను కాస్త ఆలోచించుకోనీయి మామయ్యా!..."

"బాగా ఆలోచించు. తీవ్రంగా ఆలోచించు. ఇదికూడా ఆలోచించు. ఒకవేళ నీ భార్యే అయి ఉండి—ఇలాంటి పనిచేసి ఉంటే—అప్పుడు పరువు కోసం—గౌరవంకోసం—"

"బలవంతంగా నామెడలు వంచితే ఏంలాభం మామయ్యా! నేనుకాని నిర్మలకాని ఏంసుఖిస్తాం..."

"దీనికి సమాధానం యిప్పుడు చెప్పలేను—నేనలా చేయదలిస్తే నిన్నడుగుతానా? నిన్ను మధ్యపెట్టి పెండ్లి పత్రాలు పంచినట్లయితే ఏం చేసేవాడవ్? ఆ ఉద్దేశ్యమే నాకుంటే దీనికి కారకుడవు నువ్వేనంటె—కాదనగలవా?..."

"మామయ్యా!..."

"అందుకే అంటున్నాను. ఇన్నాళ్ళ కివ్వాళ నాగీత యీ విధంగా బయటపడింది. చల్లని గోదావరి తల్లి తన విశాలగర్భంలో మాకు చోటివ్వ దంటావా?" నడిచాడు—గబగబా.

"చేసుకుంటాను మామయ్యా! భగవత్సాక్షిగా చేసుకుంటాను..." అరిచాడు సూర్యం.

మామయ్య వెళ్ళిపోయాడు.

కమల కదిలింది కండ్లలో సూర్యానికి:— "ఒకరి జీవితాల కోసం మరొకరి జీవితాల బలి..." ఆ వేదన అణగలేదు. ఆలోచన తెగలేదు. దుఃఖం కట్టలు తెగింది. కమల ప్రేమైక హృదయం కదిలించి వేసింది, ఉద్వేగం పొంగి పొరలింది. నేలమీద పడి భోరున ఏడ్చాడు.

*　　*　　*　　*

తెల్లవారి మేడమీద తన గది ప్రక్కనుంచే నిర్మల పోతూవుంటే సూర్యం పిలిచాడు. వచ్చింది.

కూర్చోమన్నాడు. కూర్చుంది తరువాత ఎలా మాట్లాడాలో అర్థంగాక తికమక పడ్డాడు.

"ఎందుకూ?...పిలిచావు?..."అడిగింది నిర్మల.

"నాకంతా తెలిసింది. వాడెవడో నాకు చెప్పవూ?"

"ఆఁ" అంటూ కండువిప్పి నోరు తెరచి, గాలి పీల్చింది—కంగారులో. తడబడ పడింది.

"భయపడకు నిర్మలా! నేను నీ క్షేమంకోరి అడుగుతున్నాను. నీ మేలుకోసం ఏదైనా చేయటానికి నిశ్చయించుకున్నాను. అతని కంతగా కావాలంటే మీ నాన్న యిచ్చేదే కాకుండా నా ఆస్తి అంతా వ్రాసి యిస్తాను. చెప్పవూ?..."

"ఎన్నెన్నో అనుకున్నాను. ఏమేమో అయింది. బోల్తాపడిపోయాను. నా హృదయమంతా క్షోభించి పోతోంది. నా యీ పాడుజీవితం ఇంకా ఎందుకు అంతంకాకుండా ఉంది." కండ్లల్లో నీళ్లు పెట్టుకుంది.

"ఏడిస్తే ఏం ప్రయోజనం చెప్పు నిర్మలా! ఒక పని చేసేముందు ఎంతో ఆలోచించాలి. ఇది సామాన్య విషయమా! పోనీలే నిర్మలా! ఏదో ఘోరం జరిగి పోయింది. వెనకుండి లాభం లేదు. ముందుకుపోయే దారి చూడాలి..." అనునయిస్తూ అడిగాడు సూర్యం.

"రంగారావు..." అంది

స్తంభించిపోయాడు సూర్యం,"వాడితో...వాడితోనా..."

సూర్యం మెదడు గిర్రున తిరిగింది. రంగారావు ఇంటరులో తన క్లాసుమేటు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఎలాగోపాసయి బి. ఏ. కు వచ్చాడు. పైకి చాలా పెద్ద మనిషి. ఠీవిగా, దర్జాగా, దర్పంగా తిరుగుతాడు. తరచి చూచిన వాళ్ళకుగాని అతని జీవితం అర్థంకాదు. ధనవంతుని ఏకైక పుత్రుడు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడతాడు. పదిమంది రౌడీలు పక్కన కొస్తూంటూ రతన్ని. ఎదురు తిరిగినవాణ్ణి ఏ సందులోనో బొమికలు విరుగగొట్టిస్తాడు. విలాస పురుషుడు. డబ్బుతో స్త్రీలు అతని చేతుల్లోంచి దాటిపోతూంటూ. మాటలతో, చేష్టలతో కొమ్ములు తిరిగిన ఆడదాన్ని వంచింపగల నేర్పరి. అవంతయినా భయం లేదు. అతని పేరు వినగానే నిర్మలంటే అసహ్యమేసింది.

"చదువుకోవడానికా-వెళ్ళింది. రంకులు వేయటానికా!"

"సూర్యం!..." అరచింది నిర్మల.

"సిగ్గులేని చలగాటాలు. చదువుకునే వాళ్ళ బుర్రల్లో ఈరోజుల్లో పెరుగుతున్నది విజ్ఞానం కాదు–"

"నోర్ముయ్!..." తీవ్రంగా అరచింది నిర్మల.

"నిర్మలా!..." కోపంతో గింజుకున్నాడు.

"నీతులు నీకంటె నాకు బాగా తెలుసు. నిన్ను చెప్పమని నేనెప్పుడూ కోరుకోలేదు. నీ సహాయం నేనెప్పుడూ అపేక్షించలేదు. నన్ను నువ్వు నిందించవలసిన అవసరంకూడా ఏమీ లేదు. నువ్వేం ఆర్చేవాడవు; తీర్చేవాడవు కావని నాకు బాగా తెలుసు..."

"నీకు సిగ్గువేయటంలేదూ ఇలాంటి తప్పుడు పని చేసినందుకు?..." ఛీత్కారించాడు సూర్యం.

"అదే అంటున్నాను. అనవసరంగా జోక్యం కలిగించుకోవద్దని. నా సమస్యను నేనే పరిష్కారం చేసుకోగలను. నువ్వేం కష్టపడవద్దు."

సూర్యానికి కోపం బాగా వచ్చింది. కాని ఓపిక పట్టాడు.

"నేను మంచిదాన్నో, కాదో కూడా తెలుసుకునే అవసరం నీకు లేదు. నా హృదయాన్ని కదలించి, అనవసరంగా కల్పించుకొని, నా విషయం తెలుసుకున్నావు. నేను పడ్డానుకదా అని, నన్ను అపహాస్యం చేస్తూ, నామీద పదిరాళ్ళు వేయటానికి ముందుకు రాబోకు. నిజానిజాలు బాగా తెలిసినవాడొకడున్నాడు—భగవంతుడు. వాడు చూస్తాడు..."

"పాపులకు భగవంతుడు ప్రత్యక్షమవుతాడు—రేపు సాక్ష్యం చెప్పటానికి."

"మాటలు మంచిగా రానీయి. నేనేం పాపిని కాదు."

"రేపు లోకమంతా అదే అంటుంది."

నిర్మలకు కోపంవచ్చింది. కోపోద్రేకంతో కనుపాపలు ఎర్రబడ్డాయి; కనురెప్పలు, అధరాలు దడదడలాడాయి. కాని తమాయించుకుంది. "లోకం అంటుందో, అనదో, ముందు నువ్వే అంటున్నావు" దుఃఖం, అభిమానం దెబ్బతినటంవల్ల, ముంచుకొని

వచ్చింది:—"నేనేం పాపం చేసాను. మోసపు మాటలను నమ్మి, పవిత్రమైన హృదయంతో, దేవతామూర్తిగా ఆరాధించానొకవ్యక్తిని. మనో దౌర్బల్యం వల్ల భవిష్యత్తును ఊహాగానం చేయలేక పోయాను, పరమ పవిత్రమయిన పరమేశ్వరుని ఎదుట ప్రమాణ స్వీకారం చేసాం; నమ్మాను మంచి తనానికి వంచన తోడయింది"—ఉద్రేకం దారి యిచ్చింది. "ఎవరి జీవితాలతోనూ కాదు, నా జీవితంతో నేనే చెలగాట మాడుకున్నాను. పట్టుకున్న పట్టువస్త్రంపామై కరచింది. నా అజ్ఞానం అగాధానికి దారి తీసింది. ఇవ్వాళ నీతో కూడా మాట పడాల్సి వచ్చింది. అసలు నువ్వెవరు నన్నడగటానికి? నీకేం హక్కుంది. నీకు చెప్పవలసిన బాధ్యత నాకేం ఉంది? పో అవతలకు... పో...పో..." కోపంతో ఉడికిపోతూ, ఆగని దుఃఖంతో పరితపిస్తూ పెదవులు కంపిస్తూ గుడ్లెర్రజేసి, బొంగురుపోయిన కీచుగొంతుకతో కయ్...కయ్... అని అరుస్తూ, చర్రున పోబోయింది. "టఫీ" మని ద్వారబంధంతలకు తగిలింది. విసురుగా పోతూ ఉండటంవల్ల, దెబ్బను తట్టుకోలేక, పట్టుతప్పి గిర్రున విరుచుకొని పడింది, "అబ్బా!"—అంటూ విలవిల్లాడింది.

అందరు ఆవిడ తప్పు చేసిందంటారు. కాని ఆవిడమాత్రం పవిత్రహృదయంతో నమ్మి మోస పోయానంటుంది. పతితను కాను అనాథను, అభాగ్యురాలినంటూ ఆ ఆర్తనాదం ఘోషించింది. అహృదయ నైర్మల్యం ఆ కన్నీటి ధారాప్రవాహంలో కనుపించింది. ఎంతో జరిగాక గాని ఒకరి హృదయం అర్థం కాదు.

సూర్యం దగ్గరగా వచ్చాడు "నన్ను క్షమించు నిర్మలా! పవిత్రతను కల్మషంలో కలుపజూచి నప్పుడు కలిగే సత్యాగ్రహాన్ని అర్థం చేసుకోవటం కష్టం. కాని సంఘదృష్టిలో నువుచేసింది తప్పు నిర్మలా! కాని నీకోసం ఏమి చేయటానికైనా సిద్ధంగా ఉన్నాను. నీకోసం నాజీవితం త్యాగం చేస్తాను. భగవత్సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఈమాటలోని భావం నీకిప్పుడర్థం కాదు,"—నిశ్శబ్దంగా మేడదిగి నడిచాడు.

నుదుటిమీది బొప్పిని చేతితో చముదుకుంది నిర్మల. ఆవిడహృదయం బీటలువారి బ్రద్దలైపోతోంది.

"నేను తప్పుచేశాను. ఘోరానికి సమకట్టాను అకృత్యానికి వడిగట్టాను" తల నేలమీద పారేసి తల్లడిల్లిపోయింది. కన్నీరు కాల్వలు కట్టింది.

* * *

పోతూ ఉంటే కొంగుపట్టుకొని లాగేవాడు. పకపక నవ్వుతూ చిలిపిగా ఏడిపించేవాడు. కాఫీయిస్తే తాగుతూ మాడనట్లుగా మీద వలికించేవాడు. తన చక్కని, తెల్లగా ఉతికినచీర కాస్తా పాడయి పోయేది. "కండ్లలో పొగ తెప్పించనా?"—అంటూ తన కండ్లల్లోకి చూస్తూ చురుక్కున సిగరెట్టు అంటించేవాడు. మంటతో గంటసేపు ఏడ్చేది తను. చేసిన కొంటెచేష్టకు నవ్వు, మంటతో బాధ, ఒక ప్రక్క కోపం కమ్ముకొని వచ్చేవి. "అబ్బా;... అబ్బా!!"—అంటూ తను బొబ్బలు పెడుతూఉంటే "ఒకవాత వంటపట్టదంటారు. ఆను...అంటూ మరో కటి అంటించ బోయేవాడు. వెనుకనుంచి "ఛీ"—అంటూ గభాలున అదరిపడేటట్టు అరచేవాడు. ఉలిక్కిపడి చచ్చేంత పనయ్యేది. లేదా గట్టిగా కండ్లు మూసేవాడు. ఎంత గట్టిగా అనుకున్నారు—కండ్లు ఎర్రబడేవి. అర్చి, గింజుకున్నా వదిలేవాడు కాదు. గిల్లి గీరి ఏడిస్తే వదలేవాడు. చదువుకుంటున్నాడు కదా దానికి భంగంకలిగించటం ఎందుకు అనుకొని చప్పుడు చేయకుండా కాఫీ అక్కడపెట్టి వెడుతూంటే "చెప్పవేం?..." అంటూ వీపుమీద చెళ్లున చరచేవాడు. పోనీ చెబితే "ఏమిటీగోల"—అంటూ డొక్కలో పొడిచేవాడు; జడపట్టి లాగేవాడు; లేదా కాళ్ళకు కత్తెర వేసి క్రింద పడేంతపనిచేసేవాడు; ఇంతా చేసి ఏం తెలియని అమాయకుడిలా పుస్తకాల్లో తలదూర్చేవాడు. అలా ఉండే సూర్యం తనతో కొన్నాళ్ళనుంచీ మాట్లాట్టం లేదు; తప్పుకుని తిరుగుతున్నాడు. అంత హుషారుగా ఉండే బావకు పిలిస్తే వినపడదు. ఎప్పుడు ఏదో ఎడతెగని ఆలోచన. కమల తలచుకుంటూ కుమిలింది.

"ఏంబావా! అలా ఉన్నావ్?..." అడిగింది.

"ఏంలేదు..." క్లుప్తంగా సమాధానం చెప్పాడు.

"ఏంలేకపోతే — ఎందుకా విచారం. నాకు చెప్పవూ?—" ప్రాధేయపూర్వకంగా, అమాయకంగా, ప్రేమపూరితహృదయంతో అడిగింది.

ఎలా చెబుతాడు? ఏమని చెబుతాడు? "ఏమున్నా ఉంటేకదూ చెప్పటానికి..."

"నాదగ్గరేందాచకుబావా! నీకెందుకు నేనంటే ఏవగింపు. నాతో యిదివరకులా ఎందుకు మాట్లాడవ్? నన్నెందుకు దూరం చేస్తున్నావ్?" ఇన్నాళ్ళనుంచీ పేరుకొని ఉన్న ఆ హృదయంలోని విచార మంతా ఒక్కసారిగా పెల్లుబికింది. ఆగలేక అతని వడిలో పడుకొని భోరున ఏడ్చింది.

అమాయికమైన, సౌందర్యపూరితమైన, నిర్మల మైన ఆమె హృదయాన్ని చూచి అతని గుండె కరిగి పోయింది. ఛట్టున వంగి ఆవేశంలో మునుపటిలా తన కౌగిలిలోకి పొదివి పట్టుకున్నాడు. "కమలా!..." అన్నాడు. "నీ ఏడుపు నేను చూడలేను కమలా! నువు బాధపడితే నాహృదయం ద్రవించి పోతుంది..." అంతలో ఏదో స్ఫురించిందతనికి. కౌగిలి వదిలేశాడు. తప్పుచేసినవాడిలా తల్లడిల్లాడు— "నేను దుర్మార్గుణ్ని కమలా!..." దోసిట్లో తలదాచుకున్నాడు. "నీసౌఖ్యం కోసం ఏంచేయటానికైనా సిద్ధంగా ఉన్నాను. నువు కష్టబడుతూంటే నన్ను తలచుకో కమలా!..."

"అదేమిటిబావా! నువ్వుండగా నాకు కష్టమెలా వస్తుంది;..."

"కమలా!...."తల్లెందుకో క్రిందనుంచి పిలిచింది.

"అమ్మెందుకో పిలుస్తోంది. ఛీ! ఏడవకూడదు. కంట్లు తుడుచుకో? అలా! ప్రతి చిన్న విషయానికి ఇలా వెలితిపడవచ్చునా? జీవితంలో మొదటి పాదంలో ఉన్నావు. ఇంకా ఎన్ని ముండ్లబాటలలోనుంచి నడవాలో? ఎన్ని భయంకరసంఘటనల ఎదుర్కోవాలో? జీవితసమస్య లెన్ని పరిష్కరించుకోవాలో? ఏమిటో యీ ప్రపంచం—అనుకున్నవన్నీ కావు. అందుతున్న వనుకున్నవి అందవు. ఆనందాలు దూర మవుతాయి. విషాదాలు చేరువవుతాయి. ఎంత ధైర్యం, ఎంత గుండె నిబ్బరం కావాలి? ప్రపంచమంతా పూల బాటలతో నిండి ఉండదు కమలా!....

"ఏమిటి బావా యిదంతా!..."

"అనుకున్నవి కానప్పుడు ధైర్యం కావాలి. అదే నేనంటున్నాను..."

"నువ్విలా మాట్లాడుతూంటే నా కెందుకో భయంగా ఉంది..."

"కమలా!..." తల్లిపిలుపు మళ్ళీ.

"వెళ్ళిరా. అమ్మెందుకో పిలుస్తోంది."

కమల మెట్లు దిగింది.

ఆ రాత్రంతా సూర్యానికి కునుకులేదు. అంతు లేని ఆలోచనలతో సదమద మౌతున్నాడు. క్షణక్షణా నికి అతని ఆలోచనల ఆకారం మారిపోతోంది. బుర్రంతా వేడెక్కిపోయింది. చికాకు ఎక్కువయింది.

అర్ధరాత్రి కావచ్చింది. కిటికీలోనుంచి చూస్తే వెన్నెల బాగా కాస్తోంది. చుక్కలమధ్య చంద్రుడు చక్కగా కానవస్తున్నాడు. మేడమీది గదికిటికీ ఏమో, చుట్టూ చాల ప్రదేశం కానవస్తోంది. కిటికీలో కూలబడి చంద్రుణ్ణి చూస్తూ, తనూ కమల యిలా చూస్తే ఎంత బాగుంటుంది అన్న ఆలోచన కలిగింది. హృదయంలో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్టయింది.

క్రింద కిర్రుమంటూ చిన్నశబ్దం వినిపించింది. తలుపుతీసిన శబ్దం వినుపించింది. ఎవరో వ్యక్తి దొడ్లో తారట్లాడుతున్నారు. బావిదగ్గరగా వచ్చి ఆగిపోయింది. సూర్యానికి అనుమాన మేసింది. మెట్లుదిగి దొడ్లోకి నడిచాడు. కొంచెం దూరంగా ఆగాడు. తీరాచూస్తే నిర్మల.

నడుంపైటతో కట్టింది. చేతులెత్తి పరమేశ్వరుణ్ణి ప్రార్థించింది. కన్నీళ్ళు తుడుచుకుంది. మనస్సు కుదుట పరచుకుంది. గట్టిగా నిట్టూర్చింది. భావిలోకి వంగింది. ఛట్టున పట్టుకున్నాడు సూర్యం.

"చావటానికి చాలా స్థలాలున్నాయి. ఇంట్లో చచ్చి యింటి వాళ్ళందర్నీ యిబ్బంది పెడితే ఏం లాభం!..."

"సూర్యం!..."

"అవును నేనే. ఇలా చేసినందువల్ల యీ కళంకం మాసిపోతుందని కదూ ఊహించావు. కారణ మేమున్న విషయంపై డొంకంతా కదిలిరాదూ?..."

"ఇంకా దేన్ని చూచి బ్రతికేను"

"అంతా దేన్నో చూచి బ్రతుకుతున్నారను కుంటున్నావా?" కొంతసేపాగి "మీ నాన్న యిప్పటికే కుమిలిపోతున్నాడు. ఊరూ, వాడా ఆడపిల్లల్ని చదివించకు, చెడిపోతారని గగ్గోలుపెట్టింది. అయినా ఆయన లెక్కచేయలేదు. ఇవ్వాళ ఆయన కుమిలి పోతున్నాడు. నువ్వీపనిచేస్తే ఆయన ఇంకా జీవిస్తాడనేనా నీ ఉద్దేశ్యం. ఆయన తదనంతరం మీ అమ్మ-"

"సూర్యం!..."

"ఇవి ఏమన్నా ఆలోచించావా? నీ వక్క దానితోనే పోతుందా యిదంతా! ఏమిపనులు చెప్పు యివి."

చాలాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"ఇప్పుడు నే నేంచేసేది సూర్యం!..."

"నువ్వేమీ చేయలేవు. చేయవలసినవారు వేరే ఉన్నారు. వారే చేస్తారు? ఏంచేస్తారో చూడు? ఒకవిషయం చెబుతాను విను. నీలో ఏమైనా పవిత్రత ఉందనుకుంటే - దాన్ని ఎవరైనా గ్రహించగలరనుకుంటే- అది నే నొక్కణ్ణిమాత్ర మేనని గుర్తుంచుకో. మొన్న చెప్పాను జ్ఞాపకముందా: నీ కోసం నా జీవితం త్యాగంచేస్తానని..."

రెండు కాళ్ళమీద పడిపోయింది నిర్మల: "నువు దేవతామూర్తివి!"

"లే—ఇంట్లోకిపద. నాకోమాట యిస్తావా నిర్మలా?..."

"తప్పక..."

"ప్రమాణపూర్వకంగా చెప్పు"

"భగవంతుని సాక్షిగా..."

"ఎన్నడూ యిలాంటి పనిచేయవుకదూ!..."

"సూర్యం..."

"ప్రమాణం చేస్తావుకదూ! పద ఇంట్లోకి..."

* * * *

వాలుకుర్చీలోపడుకుని కామశాస్త్రగ్రంథ మేదో తీవ్రంగా చదువుకుంటూన్న రంగారావుని పిలిచాడు- సూర్యం:

"ఎవరది? — ముఖానికి అడ్డంగా ఉన్న గ్రంథాన్ని దింపి ప్రశ్నించాడు.

"నేను సూర్యాన్ని."

"రా! కూర్చో!!—'వారిజాక్షులందు, వైవాహికములందు, ప్రాణవిత్తమానభంగమందు, బొంకవచ్చు నఘము బొందదధిప'—ఓహో! ఎంతబాగా రాశాడు..."

"నాకిప్పుడు ఎక్కువగా మాట్లాడటానికి తీరిక లేదు"

"నాతో ఏమైనా పనుందా?"

"అవును. నిర్మల గుర్తుందా?"

"నిర్మల!...ఎవరబ్బా!..."

"అప్పుడే మరచిపోయావా?"

"ఆనవాళ్ళు చెప్పు. పోల్చుకుంటాను?"

"నీతోపాటు యీ కాలేజీలో చదివింది."

"లిల్లీయా! చంపేశావు. దాన్ని మనం కొన్నాళ్ళు కీప్ చేశాం......"

"అలాఅనటానికి అసహ్యమేయటంలేదూ?..."

"తప్పేముంది. నాదగ్గర దాపరికంలేదు. ఇప్పుడెక్కడుంటోంది?"

"ఇంటిదగ్గర."

"పెండ్లి—గిండ్లిఅయిందా?"

"పెండ్లయితే కాలేదు."

"ఏం?..."

"నీకు తెలీదా?"

"నిజంగా తెలీదు"

"గర్భిణి"

"వాట్!"

"ఆమెమీదికివచ్చే అవమానాన్ని కాపాడవలసిన ధర్మం నీమీదఉన్నది."—అన్నాడు సూర్యం.

"అయితే నువుసారథ్యం వచ్చావన్నమాట"

"కాదు. వేడుకోవటానికి. మా కుటుంబానికి వచ్చే అపకీర్తినుంచి కాపాడమని దోసిళ్ళుపట్టి ప్రార్థించటానికి వచ్చాను. నీకు కావలసినంతడబ్బు కట్నంగా యిప్పిస్తాను."

"ఇంకా"

"అగ్నిహోత్రంలాంటి మా సంసారానికి యీ కళంకాన్ని ఆపాదించటం—అధర్మం. మీరుచేసిన యీపనికి ఎందరో కుమిలిపోతున్నారు. పరువుగా బ్రతికేవారిని బజార్లో పెట్టటం ధర్మంకాదు."

"నువ్వింతగా బ్రతిమాలుతున్నావు కాబట్టి చెబుతున్నాను. నేను దీనికి బాధ్యుణ్ణికాదు."

"అయిందేదో అయిపోయింది. దీనివల్ల కొన్ని జీవితాలు బలిదానంకాకుండాచూడు. మా మామయ్య కుమిలిపోతున్నాడు. అతనిచ్చేకట్నం చాలకపోతే నా ఆస్తంతా రాసిస్తాను. తప్పక?..."

"నీమామకూతురా?..."

"అవును. గర్భిణి అయిన ఆమెనలా వదిలేయటం న్యాయంకాదు. దీనికి నువు బాధ్యుడవుకాదూ? నీ తీయతీయనిమాటలు కాదూ?"

"ఇదో పెద్దసమస్యగా మాట్లాడకు. ఇదేం ఘనకార్యమా! ఆమెగర్భానికి నువుకారకుడవుకాదని ఎలా చెప్పగలవు?..."

"రంగా!" అరచాడు సూర్యం.

"నాతియ్య తియ్యని మాటలకు లొంగిపోయిందన్నావు. ఇంకా ఎందరు ఎన్ని శేనెలొలుకు పలుకులు పలికారో!..."

"నోరుమ్మయ్"—గర్జించాడు సూర్యం

"ఛీ! వెధవ!" ఛ్రున లేచాడు రంగారావు.

"నాకు తెలుసు నువు రౌడీవని. కాని గుర్తుంచుకో; నీ కన్నా ఎక్కువ తెగించి ఉన్నాను. నన్ను అంటలేవు. గుర్తుపెట్టుకో పాపులు శిక్షనుండి తప్పించుకోలేరు."

"పో! అవతలకు." సూర్యాన్ని విసురుగా వక్కతోపు తోశాడు రంగారావు. తలుపుకు పెళ్ళున గుద్దుకుంది ముఖం, ముందటి పన్ను రాలిపడింది. బాధతో విలవిల కొట్టుకున్నాడు. నోటివెంట బొల బొల రక్తం కారి చొక్కా తడిసిపోయింది. కండ్ల వెంట జలజల నీళ్ళు కారాయి.

రక్తం చూచి జంకాడు రంగారావు.

బాధతో—"పాపులు శిక్షకు దూరంకాలేరు".. సూర్యం రంగారావుతో అన్న ఆఖరుమాట. జేబు రుమాలు నోట్లో కుక్కుకుని నడిచాడు. పోతూ క్షణ మాగి:—"ఒకరి ముఖం చూచి ఆగాను. లేకపోతే నీ అంతం చూద్దును—"

ఎన్నడూ లేనిది ఇవ్వాళ, యీక్షణం, రంగారావు హృదయంలో దేవినట్టుగా అయింది. అటు ఇటు పచారుచేశాడు. కుర్చీలో కూలబడ్డాడు. గట్టిగా శ్వాసపీల్చి వదిలాడు. సిగరెట్టు వెలిగించి పొగకేసి కాసేపు చూచాడు. తమాయించుకున్నాడు. "హుఁ... పెండ్లి..." కాసేపాగి "ఇలా అయితే ఎంతమందిని కట్టుకోవాలి నేను." ఆలోచించాడు. "పరమపతివ్రతలు...ఇంకేం"—నవ్వాడు.

* * *

కాలుజారి ప్లాటుఫారంమీద పడితే పన్నూడిందని అందరికి చెప్పాడు. ఇల్లంతా అల్లకల్లోలమయింది.

బాగా జ్వరం కాసింది. ముఖమంతా బూరెలాగా పొంగిపోయింది. డాక్టరువచ్చి ఓ యింజక్షను యిచ్చి వెళ్ళిపోయాడు. అందరికీ అని చెప్పనుకాని కమలకు మాత్రం కంటికి కునుకు లేదు. కనురెప్ప వాల్చకుండా తెల్లవార్లూ కాపాడింది. పలవరించినప్పుడల్లా వణకిపోయేది. వంటిమీద చెయివేసి అదిరిపడేది. వేన్నీళ్ళలో గుడ్డముంచి జాగ్రత్తగా కాపేది. వళ్ళు తెలియని స్థితి సూర్యానికి. దూపుదెబ్బ తింటుందేమో అన్న అనుమానం వెలిబుచ్చాడు డాక్టరు. అలా జరక్కుండా చూడమని భగవంతుణ్ణి పదేపదే ప్రార్థించేది.

అర్ధరాత్రి తండ్రి వచ్చాడు. చూచాడు. "నువు వెళ్ళి పడుకో కమలా! నిర్మలను పంపు. చూస్తూ ఉంటుంది." అన్నాడు.

"పోనీలే నాన్నా! ఒక్క రాత్రి. ఫరవాలేదు"

"కాదులేమ్మా! ఇప్పటిదాకా నువ్వే చూస్తూ కూర్చున్నావు. కాస్త విశ్రాంతి తీసుకో. అక్కయ్యను పంపు. వెళ్ళు..."

"అక్కయ్య నాలాగా చూళ్ళేదు. బద్ధకస్తురాలు."

వృద్ధుని హృదయం తపించిపోయింది. బావమీద కమలకున్న ఆ మమకారం, ఆ నిశ్చలత, నిబ్బరం... వృద్ధుణ్ణి కదలించాయి.

"నేను చేయకూడని పని చేయబోతున్నాను." అరచుకున్నాడు మనస్సులో.

జీవిత పరమావధిని వెతుక్కుంటూ, కర్తవ్యం కోసం కలవరిస్తూ జరిగిన సంఘటనల నెమరువేసుకుంటూ, బేజారయి దిగులుతో పొర్లుతోంది మంచం మీద.

చరచరా వచ్చాడు తండ్రి—"పడుకోని ఏడవక పోతే, సూర్యందగ్గర చావరాదూ?...రోగమా!..."

ఇంత కఠినంగా, తీవ్రంగా, గట్టిగా తండ్రి మాట్లాట్టం యివ్వాళే. అదరిపడి లేచి కూర్చుంది.

పగలంతా వంటపొయి దగ్గర చాకిరిలో అలసి, అప్పటిదాకా సూర్యం దగ్గరే ఉండి, అప్పుడే పడుకున్న తల్లి, యీ అరుపుతో దిగ్గున లేచి కూర్చుంది. మెల్లగా వెంకట్రావుగారున్న గదిలోకి నడచింది.

"నేను ద్రోహం చేస్తున్నాను." ఉద్రేకంలో అరచాడు.

"ఏమిటండీ యీ అరుపులు." అంటూ దగ్గరగా వచ్చింది.

"వచ్చావా? చూడు. నేను ద్రోహం చేయటం లేదు?..."

"మీరు తెలివైనవారు. ఆలోచించే ఏదైనా చేస్తారు. మీరేం చేసినా, తప్పు మాత్రం చేయరు..."

"చూడు. గౌరవం, మర్యాదా అంతా పోయి యీ కళంకం మూటకట్టుకొని యింకా నేనెందుకు జీవించటం చెప్పు?"

"గౌరవం, మర్యాదా, కళంకం, యివికాదు నాక్కావలసింది. మీరు. మీరులేని తెల్లవారి నేనెట్లా ఉంటాను. పిల్లల సంగతి ?..."

*          *          *          *

శుభలేఖ పట్టుకొని గబగబ మెట్లెక్కింది కమల. సూర్యం ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. "బావా !..." పిలిచింది.

తిరిగి చూచాడు. అక్కడ పెట్టింది శుభలేఖ. చదివాడు.

"నీ పెండ్లి శుభలేఖ." పెదవులు బిగబట్టి అడిగింది.

"అవును"

"అక్కయ్యను చేసుకుంటున్నావా ?..."

"ఏం ? చేసుకోగూడదా ?..."

"ఎందుకు చేసుకోగూడదు." దుఃఖం ఆగటంలేదు. అయినా గంభీరంగా అంది—"నాకొమాత్రం తెలిపితే నేం ?..."

"సంప్రదించ లేదంటావా ? కటువుగానే అన్నాడు. కమలను తను మరువలేదు. కనీసం ఆమె తన్ను మరచిపోవాలి. ఈ మాటలతో ఆమె మనస్సు నొప్పించాలనికాదు. ఆ హృదయంలో అసహ్యం కలగాలని.

"అవును. నాకు చెప్పేదేమిటి ?..."

"ఏం ? మీ అక్కయ్యను చేసుకోడం నీ కిష్టం లేదా ?..."

"నా కెందుకుండదు. మా అక్కయ్యకు ... బావకు...పెండ్లి..." పెల్లుబికే దుఃఖం అణచుకోలేక గోడకేసి తిరిగింది. తూలుతూ మెట్లు దిగింది. అనుకోని యీ సంఘటనకు ఆమె తట్టుకోలేకపోయింది. తన గదిలోకి పోయి తలుపు వేసుకుని కూలబడి భోరున ఏడ్చింది.

రవణ హృదయం అమాయికమైంది. ఏదీ తొందరగా అర్థంకాదు. శుభలేఖ చూచి అక్క దగ్గరకు వచ్చాడు. "గుడ్ విషెస్ మేడమ్" అంటూ అక్కకు చూపాడు. నిర్మల తల్లక్రిందులయింది.

రవణ మేడమెట్లు ఎక్కాడు. సూర్యంతో: "ఏంరోయ్ ! బావా ! ప్లేటుఫిరాయించావు ? అంతా కమలను పెండ్లి చేసుకుంటావనుకుంటూంటే అమాంతం నిర్మల మొగుడివై పోతున్నావు. ఓపినియన్స్ చేంజి చేస్తూంటేగాని పొలటీషియన్ కానేరడట. గిరీశమన్నాడులే. వస్తా. మా స్నేహితుల్ని పిలవాలి... వెళ్లాడు.

అతను వెళ్ళిందాకా వుండి నిర్మల లోనికొచ్చింది. సూర్యాన్ని చూచింది. సూర్యం నిర్మలను చూచాడు. ఇదివరకులా అతని కండ్లలో కండ్లు కలిపి చూడలేక పోయింది. తల దించింది. అడిగింది: "ఇది అంతా నీకు తెలిసే జరిగిందా?..."

"అవును"—అన్నాడు సూర్యం.

"మరి నాకెందుకు చెప్పలేదీ విషయం?"

"నేనుకాదు చెప్పాల్సింది..."

"నా అభిప్రాయం అడుగకూడదా?"

"అందుకు నేనుకాదు అర్హుణ్ని."

"మరి నువ్వెందు కంగీకరించావా?

"అవును."

"ఇది నీ కిష్టమేనా?"

"ఇక్కడ యిష్టాయిష్టాల ప్రసక్తి లేదు."

"కాని నేను"—

"నాకు తెలుసుగా."

"నువ్వేం సుఖిస్తావ్?" ప్రశ్నించింది నిర్మల.

"దీని అంతరార్థమది కాదు."

కాని...కాని...‘నేను వివాహితను."

"సంఘం దృష్టిలో కాదుగా?"

"నాకో సహాయం చేసిపెట్టు సూర్యం."

"ఏం చేయాలి."

"నన్నొక్కసారి — ఆఖరుసారి— అక్కడకు తీసుకొని వెళ్ళు."

"ఎక్కడికి?"

"కడసారి కాళ్ళుపట్టి వేడుకుంటాను."

"లాభంలేదు నిర్మలా! పరిస్థితులు విషమించాయి."

"కాదు సూర్యం. నాలో ఎంత ఝంఝూమారుతం వీస్తోందో నాకు తెలుసు. పొరబాటున కొరివితో తల గోక్కున్నాను. ఒక్క తప్పటడుగుతో నా బంగారుజీవితం పాడైంది. యౌవనం కళ్లు కప్పింది. పశుత్వ ప్రేరేపణకు బలయ్యాను. ఓ చిన్న ఆశాజ్యోతి ఇంకా వెలుగుతోంది. అది ప్రజ్వరిల్లుతుందో, చల్లారుతుందో తేల్చుకోవాలి." ఇంతవరకు నిబ్బరంగామాట్లాడింది "ఒక్కసారి ఆ దేవాలయంలోకి తీసుకొనివెళ్లు. ఏ దేవాలయంలో ఏ పరమేశ్వరుని సన్నిధానంలో

ప్రమాణస్వీకారం చేసామో—అక్కడనుండి యెలుగెత్తి పిలుస్తాను. వారొస్తారు. నాకు నమ్మకముంది. తప్పకుండా వింటారు, వస్తారు. నేను వెళుతున్నాను, పిలుస్తాను..." ఆవేశంలో, పరవశంలో పొబోయింది.

"నిర్మలా!"

"ఇహ నా బ్రతుకింతేనా సూర్యం!" ఏడ్చింది.

సూర్యం అనుకున్నాడు: "భగవాన్! ఇందులో తప్పెవరిది?"

*       *       *

నలుగురూ ముక్కుమీద వేళ్ళు వేసుకు నేట్లుగా ఏ పటాటోపం లేకుండా నిర్మలా సూర్యంల వివాహం జరిగిపోయింది. ఇంట్లో జరిగే ప్రథమ కార్యం ఇలా జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. వీళ్ళిద్దరికీ అనుకోకుండా వివాహం కావటం చుట్టుప్రక్కల ఆలోచనలను, అనుమానాలను వ్యాపింపజేసింది. ఇంత సందట్లోను ఆ యింట్లో అందరి ముఖాల్లోనూ విషాదరేఖలు స్ఫుటంగా కనుపిస్తున్నాయి. పుట్టెడు దుఃఖాన్ని దిగమ్రింగుకుని చిరుపెదవులమీద ఏదో నవ్వబోయేవారే అంతాను. అసలు యీవివాహం యింతక్లుప్తంగా జరగటానికి ముఖ్యకారణం సూర్యం గట్టిపట్టుదల.

మంగళసూత్రం కడుతూన్నపుడు సూర్యం కదిలాడు. నిర్మల రెండు కన్నీటిచుక్కలు రాల్చింది. కమల హృదయం రెపరెపకొట్టుకుంది—తన అమూల్యవస్తువు జారిపోయిందని. కాని కమలకేం తెలుసు. ఉదయభానుని లేతకిరణాలను చవిచూచి ఉప్పొంగిపోయింది. స్థానభ్రష్టత్వం చెందినపుడు ప్రస్ఫుటంగా వచ్చే మధ్యాహ్నమార్తాండుని ప్రచండకిరణాలకు కోమలమైన కమలపు సహస్రదళాలు ఎలా వాడిపోతాయో ఆమెకేం తెలుసు. కమలం సూర్యుణ్ణి ఆకర్షిస్తుంది. ఆహ్వానిస్తుంది, ఆనందిస్తుంది. కాని ఎప్పుడు?

అన్నిటికన్నా వింతవిషయం. పెండినాటిరాత్రే శోభనకార్యంకూడా నిర్వహించటానికి నిశ్చయించారు పెండ్లిపెద్దలు.

సర్వాలంకారాలతో సుశోభితమైన గది. చక్కగా అమర్చిన పందిరిమంచం. చక్కని పరుపు, మెత్తనిదిండ్లు, తీర్చిదిద్దిన పక్క. వధూవరులు ఆరగించటానికి పసందైన ఫలహారాలు. సుగంధద్రవ్యాల సువాసనల ఘుమఘుమలు అన్నిటినిమించి మనస్సును మమకారాదులతో ముంచితేల్చే ముగ్ధమనోహరమూర్తి (నిర్మల) మూలకు మరలిఉంది.

*       *       *

భయం, అనుమానం, విచారం, అభిమానం—ముంచుకునివచ్చాయి నిర్మలకు. హృదయం దహించుకునిపోతూంది. సజలనేత్రాలతో నిలుచుంది.

"పడుకో నిర్మలా! చాలారాత్రయింది. అబ్బ! ప్రొద్దుటినుంచి నలిపేశారనుకో. ఈ మూడుముళ్ళకు ఎంత కోలాహలం. ఎంత అనవసరమైన ఖర్చు. మన దేశంలో మనవాళ్లు యీతంతు కొంతమార్చాలి. ఎట్లా చేసినా పెండ్లేకదూ! వేలు ఖర్చుపెట్టి దేశంనాటిబంధువుల్ని పిలిస్తే, ఎంతచేసినా, చూచినా, యీదూషణ, తిరస్కారాదులు "అదిలేదు...ఇదిలేదు..." తప్పదు కాబోలు.

"అలసట బాగా వచ్చిఉంటుంది నీకు. నామాటలతో మరీ విసిగించుతున్నాను నిన్ను. అలా ఆపరుపుమీద పడుకో. మెత్తగా ఉంటుంది. నేనిట్లా పడుకుంటాలే..." అంటూ ఓదుప్పటిలాగి క్రిందపరచి, ఓదిండు లాక్కున్నాడు.

ఎలా సంబోధించాలో అర్థంగాక చాలాసేపు తికమకపడింది నిర్మల. కడకు:—"అది చాలాతప్పు! నేనే క్రిందపడుకుంటాను. మీరు మంచంమీద పడుకోండి..." అంది,

"మరేమిటి? నా పేరు సూర్యంకదూ!..."

"కాని ఇప్పటి మన సంబంధం వేరు. అలా పిలువకూడదు..."

"ఇప్పుడున్న తేడా మనలో ఏముంది?..."

నిర్మల మాట్లాడలేదు.

"నువు నాకేమవుతావో నాకు తెలియదు. కాని నేనుమాత్రం నీ గౌరవమర్యాదలకు సంరక్షకుణ్ణి. మరచిపోయావా నిర్మలా! నీకోమాట యిచ్చాను. "నీకోసం నా జీవితం త్యాగం చేస్తానన్నాను." ఒకసారి నామాటలతో నిన్ను చాలాబాధపెట్టాను. ఏమనుకోకు."

చాలాసేపు నిశ్శబ్దంగా గడచిపోయింది: "నాకిప్పుడు ఆశాలేదు నిరాశాలేదు. సుఖంలేదు కష్టంలేదు. కాని ఒక్కటిమాత్రం నేనుచేయాలి. కమలకొకమాట యిచ్చాను నిర్మలా!"...ఈమాట లంటూ ఉండే అతని కనురెప్పలు తడిశాయి. "ఆవేశమొచ్చినా, దుఃఖమొచ్చినా ఆపుకోలేని మెత్తని హృదయం. చిన్నసంఘటనకే బహుబాధపడుతుంది. ఆమెహృదయాన్ని గుర్తించి, పదిలంగా పువ్వుల్లో ఉంచి పూజించేవాణ్ణి వెతకాలి. లేకపోతే జీవితంలో

మహాక్షోభపడిపోతుంది.” కాసేపాగి “పాపం! డాక్టరీ చదువులంటే మహాఅభిమానం. డాక్టరునే తేవాలి. తెస్తా నిర్మలా” “నీ సుఖంకోసం ఏదైనా చేస్తా”నని మాటకూడా యిచ్చాను కదూ!”...అంటూ క్రిందనే పడుకున్నాడు.

“అదేమిటి! క్రింద ఎట్లాపడుకుంటావ్?”... అలవాటుచొప్పున ఏకవచన ప్రయోగం చేసింది. ఛట్టున నాలుక కరచుకుంది.

దేహాన్ని దగ్గరకు గుంజుకుని:—“రాతిమీద వర్షంకురిసినా, చలివేసినా, గాలివీచినా, యెండ కాచినా ఏమవుతుంది?”...ముసుగుతన్నాడు. అలసిన శరీరం అరగంటలో నిద్రకు వరిగింది.

నిర్మల, సూర్యం ఒకయింట్లో పెరుగుతూ వచ్చారు. ఇప్పటివరకు వారిద్దరిమధ్య వున్నభావాలు వేరు. నిర్మలను సూర్యం, ఓ చెల్లెలిలాగానో, అప్ప లాగానో, వదినలాగానో భావిస్తూ వచ్చాడు. ఒక్క సారిగా ఆమెను ఆలిగా భావించలేదు. అతనికలాంటి అభిప్రాయం లేదు.

ప్రచండ ఝంఝామారుతంమధ్య ఓ దీపకళిక ఉంది. నలువైపులనుండి హోరెత్తి వీచేగాలికి ఆ దీపం ఆరిపోకుండా అతడు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే ఆదీపానికి అతనికి సంబంధంలేదు. అతనిదీ కాదు. ఎవరో తప్పనిసరిగా బలవంతపరిచారు. అప్ప జెప్పారు. ఆ దీపాన్ని ముట్టుకుని చెయికాల్చుకోనటం అతని కిష్టంలేదు. ఆ ఉద్దేశ్యం కలుగలేదు. అయితే అతనలా సంచరిస్తే ఏంజరిగేదో!

ఆరగించేవారు లేక చల్లారిపోయాయి ఉపాహారాలు. అగరువత్తులు ఆరిపోయాయి. సువాసనలు సమసి పోయాయి. పటాలపై పాండుతున్నాయి క్రీనీడలు.

నిర్మల చాలా సేపటిదాకా నిద్రపోలేదు. నిద్ర పోతూన్న పవిత్రమయిన సూర్యం మూర్తిత్వాన్ని చాలాసేపు చూచింది. ఆలోచనాతరంగాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆమె హృదయంలో సూర్యం ఒక దేముడిలా కనిపించాడు. పాదాభివందనం చేసింది. అక్కడే కటిక నేలమీద పడుకుంది.

* * *

ఒకనాడు మామ అల్లుడితో అన్నాడు. “ఈ యేటితో కమల చదువుకూడా మానిపించివేస్తున్నాను.”

“అలా కాదు మామయ్యా! అలా జరగటానికి వీల్లేదు...” అన్నాడు- సూర్యం.

“నీకు తెలియదు.”

“నాకంతా తెలుసు. రాయీ, రత్నపు బగువులు ఒకేంత ఉండవచ్చు. కాని విలువలో చాలా తేడా ఉంది మామయ్యా!...సానపెట్టినకొద్దీ అంతర్భాగం దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది. అందర్నీ ఒక త్రాసులో తూచకూడదు.”

* * *

సూర్యానికి నిర్మలకు ఉన్న సంబంధం చాలా సున్నితమైంది. వెటకారంగా గాని, హాస్యానికి గాని, నవ్వుతూ తుళ్ళుతూ వాళ్ళు ఎప్పుడూ మాట్లాడుకో లేదు. ముందే చాలా ముభావంగా మాట్లాడుకునే వారు. సంఘంలో వారిద్దరూ ఆలుమొగలు. ఒకేగదిలో పడుకోబెడతారు యింటివారు కూడాను. కాని ఆ రెండు మంచాల మధ్య ఉన్న అఖాతం ఎవరికీ తెలియదు.

ఏ చిన్నపని అయినా నిర్మలకు పురమాయించదు సూర్యం. నిర్మల మరీ క్లుప్తంగా మాట్లాడుతుంది- ఎప్పుడైనా. ఎదైనా కావాల్సివస్తే ఫలానిది కావాలంటుంది. ఎందుకు, దేనికి అన్నప్రశ్న ఎప్పుడూ లేదు. చప్పుడుకాకుండా తెచ్చి అక్కడ పెట్టిపోతాడు.

కడుపుతో ఉన్నవారు కనకుండా ఉంటారా? ఏడు నెలలు తిరక్కుండా నిర్మల నీళ్ళాడి కూర్చుంది. పండులాంటి మొగపిల్లాడు. పదిమంది పలురకాలుగా చెప్పుకున్నారు.

“పెండ్లయి ఏడునెలలన్నా కాలేదు” ఒకామె.

“నెలతక్కువ వెధవ”—శాస్త్రీకరించారొకరు.

“మొన్న రవణమ్మకూతురు నీళ్లాడలా?” నిదర్శన పూర్వకంగా మరొకరు.

“ఏడునెల్లకే కనేస్తున్నారమ్మా!” ఆశ్చర్యంగా ఇంకొకరు,

“ఇంకా నయం. పురాణాల్లోను, రామాయణ, భారతాల్లోనూ ఏడు ఘడియలకే కన్నారుటగా...” పౌరాణికంగా చెప్పిందొకామె.

“అసలుసంగతి వేరే అయిఉండాలి. సూర్యానికి, నిర్మలకు ఇదివరకే ఏదో సంబంధం ఉండి ఉండాలి. లేకపోతే యింత హడావుడిగా యీ అనుకోని వివాహం ఎందుకు జరుగుతుంది? లోతులు తరచిందొకతె.

బారసాల కూడా చాలా నిరాడంబరంగా జరిగింది.

* * *

నిర్మలకు సూర్యానికి వివాహమైనతరువాత కమల సూర్యంతో ఎప్పుడోగాని మాట్లాట్టం మాని వేసింది. అయితే వివాహం ఎందుకయిందో కమలకు తెలియదు. ఆ చిదంబర రహస్యం తెలిసినవారు బహు కొద్దిమంది. సూర్యం తన్నెందుకు కాదన్నాడు? తన్ను చూచి తప్పుకొని ఎందుకు తిరుగుతున్నాడు? వంటరిగాఉంటే అనేక ఆలోచనలు. చిన్నప్పటి వారి సంబంధం గుర్తుకువచ్చేది. నేత్రాలు తడుపుకునేది. ప్రేమ ఫలించలేదు. విరక్తి కలిగింది. ఏహ్యభావం కలిగింది. మరి అతను లేకపోతే ఏదో బాధ, ఏదో వెలితి హృదయంలో కలుగుతుంది. కాదనలేదు; రమ్మనలేదు.

ఆమె తలపు వేరు. డాక్టరీప్యాసయి మానవ సేవలో బ్రహ్మచారిణిగా ఉండిపోదామని. ఆ ఉద్దేశ్యాన్ని అనేకసార్లు వ్యక్తపరచింది. కాని వినేవారెవరు. కమల వివాహంకూడా కడకు నిశ్చయించారు. వద్దని, చేసుకోనని, చస్తానని, పేచీ వేసింది. కాని లాభంలేకపోయింది. పెండ్లి పత్రికలు వెళ్ళాయి. భారీఎత్తున శుభకార్యం చేయాలని నిశ్చయించారు. ముహూర్తం సమీపించింది. బంధువులు ఒక్కరొక్కరే విచ్చేస్తున్నారు. కడకు పెండ్లివారుకూడా విడిదిచేశారు.

ఒక్కసారి ఒక మూర్తి ఆవిడ హృదయంలో స్థిరంగా స్థావరమేర్పరచుకుంది. ఆ వ్యక్తిని కాదని అదేచోట మరో వ్యక్తికి ఎలా స్థానమీయగలుగుతుంది. ఆమెది అరణ్యరోదన అయిపోయింది.

ఇదిలాఉండగా ఇవ్వాళే కమలను పెండ్లికూతురును చేశారు. రేపు తెల్లవారుఝామున లగ్నం. అటు విశ్వనాథాన్ని పెండ్లికొడుకు చేశారు. విశ్వం చాలా అందంగాఉంటాడు. విశాలమైన నుదురు, పెద్దకండ్లు ఇంత ముక్కు—బాగుంటాడు. మొన్ననే డాక్టరీ పరీక్ష యిచ్చివచ్చాడు. కొంచెం సుకుమారి. కలవారింటి బిడ్డడు. బుద్ధిశాలి.

కమల పెండ్లికి సూర్యం ఎన్నో కానుకలు తెచ్చాడు. మంచి పెద్దపెట్టె ఒకటి కొన్నాడు. విలువైన జరీచీరలతో నింపాడు. చీరెలపైన చక్కని ముచ్చటైన జాకెట్టుగుడ్డలు పెట్టిఉన్నాయి. ప్రక్కగా ఎర్రటి పలుచటి కాగితంలోచుట్టి రెండుజతల గాజులు పెట్టిఉన్నాయి. అందమైనపెట్టెలో ఖరీదైన నెక్ లేస్ ఉంది. ఒకప్రక్క “టాయ్‌లెట్ బాక్స్” ఉంది. ఇంకా ఏవోఉన్నాయి. అయితే రెండెకరాలు తెగ నమ్మాడని ఎవరికి తెలుసు?

ఈ పెట్టె సరాసరి కమలగదిలోకి వెళ్ళింది. సూర్యం తిన్నగా మేడమీద తనగదిలోకి వెళ్ళిపోయాడు. ఇవ్వాళ, ఏదో కొద్దిసంతోషం అతనిలో ఉంది. సిగరెట్టు ముట్టించాడు. చిన్నగా యీలపాట పాడుతున్నాడు.

కమల యివ్వన్నీ చూచి నిశ్చేష్టురాలయింది. ఎవరు తెచ్చారో మోసుకొనివచ్చిన పాలేరు నడిగి తెలుసుకుంది. సూర్యం పేరు విన్నతరువాత వాటిని ముట్టుకో బుద్ధికాలేదు.

“ఇవ్వన్నీ ఎవరు తెమ్మన్నారు నిన్ను?”—విసురుగా సూర్యం గదిలో అడుగుపెట్టి కసురుకుంటూ అడిగింది.

“ఒకరు తెమ్మంటే తెస్తానా!...” తాపీగా సమాధానం చెప్పాడు.

“మరి.........”

“మనింట్లో శుభకార్యమవుతూంటే యీమాత్రమయినా ఉండవద్దా?...”

“దీనికి పెద్దవు నువ్వా?...”

“ఏం? ఎందుకు కాకూడదు. నాకుమాత్రం బాధ్యతలేదా? మామయ్య ఎన్నో సంబంధాలు చూచాడు. నాకు నచ్చలేదు. ఇతను నచ్చాడు. ఇతనూ, నేను కలిసి చదువుకున్నాం. మా అమ్మాయిని చేసుకుంటావురా అన్నాను. నవ్వాడు. కుదిర్చాను. రేపో మాపో గవర్నమెంటు ఉద్యోగి కాబోతున్నాడు.”

“నిన్నెవరు కుదర్చమన్నారు?...”

“కన్యకు కల్యాణం తప్పదురా అన్నాడు మామయ్య...”

“ఇవ్వన్నీ ఎందుకు తెచ్చావ్?...”

“రేపటినుంచి మిసెస్ డాక్టరు కాబోతున్నావు కదూ! పట్టుమని పదయినా ఖరీదుగల చీరెలు ఉండవద్దూ! రేపటినుంచీ ఎన్ని ప్రోగ్రాము లుంటాయో! లేడీస్‌క్లబ్బులు...మహిళాసంఘాలు...ఇంకా ఎన్నో. అధ్యక్షతలు... ఉపన్యాసాలు ... ఓహ్!” నవ్వాడు.

“నీకెందు కవి?”

“నాకెందుకేమిటి? నా కమలకు పెండ్లవుతూంటే నేను పెట్టుకోవద్దూ!...” ఆవేశంలో అనేశాడు. తెలుసుకొని తలదించాడు.

"బా...వా!..."

"ఏంలేదు కమలా! ఏమిటో ఏదీ విపరీతంగా ఉండకూడదు. ఆనందం పట్టలేకపోయేసరికి కళ్లు తడుస్తాయి" కమల కనిపెట్టిందని యీ మాటలని కన్నీళ్ళు తుడుచుకోబోయాడు. కాని అవి ఆగేటట్టున్నయ్యా!

"నన్నెందుకు కాదన్నావు బావా!"... కమల కూడా పూర్తిగా కరిగిపోయింది. ప్రేమోద్రేకాలు ఒక్కసారి విజృంభించాయి.

ఇన్నాళ్ళకివ్వాళ వారిద్దరూ తిరిగి ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. హృదయకవాటాలు తెరుచుకున్నాయి.

సూర్యం అన్నాడు: "నిన్ను కాదంటే యివ్వన్నియెందుకు తెస్తాను. ఒకసారి ఏం చెప్పాను? నీ సుఖం కోసం ఏదైనా చేస్తానని చెప్పలేదూ? నీకే లోటు రాకుండా యివ్వన్ని తెచ్చాను. మరి మామయ్య యిన్ని కొనగలడా? అందుకే తెచ్చాను..."

"బావా!..."

"నన్ను బాగా అర్థం చేసుకో కమలా! నీ పెండ్లి మహావైభవంగా జరగాలి. అందుకే ఎక్కడెక్కడి బంధుమిత్రుల్ని పిలిపిస్తున్నాను. అయిదు రోజులు దివ్యంగా కావాలి. అందరి అభిమానాలను చూరగొన్నదానివి. నీ సుఖానికి ఏ లోటూ రానీయను. నన్ను గురించి ఎవరైనా ఏమైనా అనుకుంటే వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు. చూడు కమలా! నీకేమైనా ఇబ్బంది కలిగితే నన్ను తలచుకో వూ! నాకు కబురంపవూ!..."

"ఇవ్వన్నీ నాకు సుఖాన్ని చేకూరుస్తయ్యా బావా!..."

"చూడు కమలా! నా సంతోషం నువు కోరితే నామీద నీకేమైనా అభిమానముంటే ఏ కలతలూ రాకుండా యీ వివాహం జరగనీయి కమలా! నీనుంచి నేనంతే కోరుకుంటున్నాను..." చరచర దిగి వెళ్ళిపోయాడు.

కమల కుప్పగా కూలబడిఉంది. పక్కగా ఉండి నిర్మల యీ సంభాషణ అంతా విన్నది. సూర్యం వెళ్ళిపోయాక మెల్లగా గదిలో అడుగుపెట్టింది. మెల్లగా అన్నది: "కమలా! నన్ను గురించి విచారించకు. అసలు విషయాలు నీకు తెలియవు. ఇలాంటి విషయాలు తెలుసుకోకుండా ఉండటమే మంచిది. నేను పాపం చేశాను కమలా! నేను చేసిన పాపానికి భగవంతుడు విధించే శిక్షకు భయపడి పారిపోయేంత పిరికిదాన్ని మాత్రం కాదు..." కొంచెం కదిలింది నిర్మల.

"సంఘ దృష్టిలో మే మిద్దరం ఆలుమగలం. నేనతనికి ప్రియమయినదానినే కాని ప్రేయసిని కాదు. అగ్ని సాక్షిగా పెండ్లాడిన భార్యనే కాని అర్థాంగిని కాదు. నన్ను నీచంగా మాత్రం అర్థం చేసుకోకు కమలా! అందుకే నిశ్చయించుకొన్నాను. నీ సుఖానికి నేను తోడ్పడతాను కమలా! త్వరలో నే నా నిశ్చయాన్ని నువు తెలుసుకుంటావు."

"నీకంటె ముందు నే నే నిశ్చయం చేసుకున్నాను. చూస్తావు త్వరలో ఏం జరుగుతుందో నాకు తెలుసు నా సుఖానికెవరూ సహాయపడలేరని..." కొంచెం ఉద్రేకమొచ్చింది కమలకు— "నీ సహాయం నాకు తెలుసు. కాని నన్నేమీ చేయలేవు. నువు చేసేది నాకు తెలుసు. నాకూ బావకూ ఏదైనా సంబంధం అంటగట్టి అభాసు—"

"కమలా!..." లాగి కొట్టింది గూబమీద ఆవేశంలో నిర్మల.

కోపఘూర్ణిత నేత్రాలతో క్షణం నిర్మల వంక చూచింది కమల—వెళ్ళిపోయింది.

తల నేలబాదుకొని భోరుభోరున ఏడ్చింది నిర్మల.

* * *

అర్ధరాత్రి కావస్తోంది. అంతా నిద్రలో ఉన్నారు. స్టేషనులోనుంచి కెవ్వన కేకేసి రైలు ఆ వూరువదలి వెళ్ళిపోయింది. భయం, అనుమానం, విచారం, దిగులు, దుగ్ధతో దగ్ధమయే హృదయంతో, అట్టిట్టాడుతూ, ఓ మామూలు చేతిసంచితో, ఒక మూలగా వదిగి కూర్చుని ఉంది-ఓఅమ్మాయి, అందులో.

దూర సుదూర తీరాలకు పయనం చీకటి గుయ్యారం. కీచురాళ్ళధ్వని. జంబుకాల భయంకర నినాదాలు. గుడ్లగూబల కలవరం. పిశాచాల పయనం. పట్టాలమీద రైలు చక్రాలు పరవళ్లు త్రొక్కుతూ పోతున్నాయి.